## ౫

రాజుగారూ మాస్టరుగారూ ఆశ్చర్యపోయినారు. వాకిట్లో అందరు మాట్లాడుతుంటే దొంగలు ఎల్లావచ్చారు? అని మొదటిప్రశ్న. నేనూ ఆవిడా అమ్మాయి ఇంతమందిచూస్తుంటే కట్టెలాగ ఎదురుగా అంతసేపుఎందుకు నిలబడ్డాడు? అని రెండోప్రశ్న. అల్లా మొండిచేసుకొని ఉన్నవాడు ఎల్లా తప్పించుకొనిపోయినాడు. అని ప్రశ్నపైని ప్రశ్నలొచ్చినాయి.

వాళ్లు నన్ను ఉద్దేశించి మీరు చూచారా దొంగలను అన్నారు. "నేనైతే చూడలేదు. నాకు కళ్ళ జోడు లేనిదే దూరపువస్తువు సరిగ్గా కనిపించదు. మా ఆవిడ అదిగో దొంగలు అని చూపిస్తే—ఛా! అక్కడ ఎవ్వరున్నారన్నాను. దగ్గరకు వెళ్లి చూద్దామని లాంతరు తీసుకొని బయలుదేరే సరికి, బుర్రచితక కొడతా డనుకొందో ఏమిటో కాంతం వెనక్కు లాగింది నన్ను. అదుగో ఉన్నా డంది మా అమ్మాయి కూడాను. లేతకళ్ళవాళ్ళు ఇద్దరు ఉన్నారంటుంటే నేను మసక కళ్ళవాడిని లేదంటం తెలివితక్కువ అని అనుకొని 'దొంగలు' 'దొంగలు' అని కేకేశాను అన్నాను. అదిగాక నాకేదో దయ్యం కనిపించింది అన్నాను.

మీరు చూశారా అని కాంతాన్ని అడిగారు—చూశాను ఒక అతను పొడుగు, ఒకడు పొట్టి. అందులో ఒకరితల దుబ్బుతల. కదల కుండా మెదలకుండా నుంచున్నారు అక్కడ



అన్నది.

మాస్టరుగారూ రాజుగారూ పకా పకా నవ్వటం మొదలుపెట్టారు. మా అమ్మాయి తలరేగి దుబ్బుగా ఉంది ఆరోజే తలంటి నీళ్ళు పోసుకోవటంచేత. మా అమ్మాయికంటె కాంతం కొంచెం పొడుగు. ఇంక చెప్పవలసినదేముంది? ఈ యిద్దరికీనీడలు ఆ గోడపై పడ్డవి. అవి జూచి వీళ్ళు దొంగలని భ్రమపడ్డారు. మిగతా కథంతా జరిగింది.

సరే బాగానే ఉన్నది తప్పక అల్లాగే జరిగి ఉంటుందని నాకు తోచింది. కాని వీళ్ళకు ముందు దీపం ఉంది కాని వెనక లేదు. వీళ్ళ నీడలు ముందుకు ఎందుకు పడ్డాయా అని నూతనసమస్య వచ్చింది. దానికి జవాబు దొరకలేదు. ఒకవేళ నిజంగా దొంగలే వచ్చారేమో అని అనుమానం కలిగింది. రావటంవట్టి అబద్ధం అని అనుకొని నీడలు ముందు పడటానికి కారణం ఏమా అని ఆలోచించాను.

కొంచెం ఆలోచించుతే నిజం తేలింది. మా యింటిముందు ఒక మునిసిపల్ లాంతరు ఉంది, ఆ లాంతరుకాంతి కిటికీలో నుంచి ఇంటిలోకి వస్తున్నది. ఆ కారణంచేత నీడలు మనుష్యులముందు పడ్డయి!

## ౬

అంతా అయిపోయింది. ఎవరిదారిని వారు పోయినారు. మేము నిద్రపోవాలెనని పడుకొంటే నిద్రపట్టదు. మమ్మ

